క్లుప్తంగా

మంత్రులను కలిసిన మహిళా నేతలు



పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభావతి రెడ్డి

ఏన్కూరు: కాంగ్రెస్ నాయకురాలు కొప్పుల ప్రభావతి రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను పలువురు నాయకులు కలిశారు. ప్రగతిభవన్‌లో మంత్రులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు దొబ్బల సౌజన్య, జూలూరుపాడు, కారేపల్లి మహిళ నాయకురాళ్లు నాగవేణి, ప్రియాంక నాయక్ పాల్గొన్నారు.

భట్టిని కలిసిన మాజీ జెడ్పీటీసీ, నాయకులు



ఎర్రుపాలెం: భట్టికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిర/ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు మల్లు భట్టివిక్రమార్కను హైదరాబాద్‌లో గురువారం మధిర మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూరంశెట్టి నాగభూషణం, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా రోడ్లు, కల్వర్టులు, డ్రెయినేజీ లను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. వినతిపత్రం అందించారు. దీంతో భట్టి సానుకూలంగా స్పందించారు. భట్టిని కలిసిన వారిలో బండారు నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, వేజండ్ల సాయికుమార్, లక్కిరెడ్డి అయ్యప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు భట్టి విక్రమార్క పర్యటన

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎర్రుపాలెం మండలంలో శనివారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మామునూరు పేట చెరువు వద్ద అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం.. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి పర్యటనను జయప్రదం చేయాలని తెలిపారు.

పదోన్నతి



నియామక పత్రం అందజేస్తున్న ఉన్నతాధికారులు

కారేపల్లి: మండలంలోని భల్లూనగర్‌తండా గ్రామానికి చెందిన (బెల్ రవి) గుగులోతు రవి భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బెల్) హైదరాబాద్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా.. గురువారం ఆయన మేనేజర్ (ఫాస్ట్ ట్రాక్)గా పదోన్నతి పొందడంతో.. నియామక పత్రాలను బెల్ కంపెని ఉన్నతాధికారులు రవికి అందజేశారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం గ్రామంలోని శ్రీవిశ్వహరిహర పీఠం నిర్వాహకుడు, పంచాంగకర్త పెద్దింటి సూర్యనారాయణమూర్తిని కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ(ఎంఎస్ఎంఈ) తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ నేషనల్ వైస్ చైర్మన్ సీహెచ్ ప్రసాదరెడ్డి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బి.వేణుగోపాల్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. దీంతో సూర్యనారాయణమూర్తికి పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మిర్చి రైతు కంట్లో కారం..

- నకిలీ విత్తనాలతో నష్టపోయిన అమ్మపేట రైతులు
- నాలుగు నెలలైనా కాత, పూత లేదని గగ్గోలు
- నర్సరీ నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- ఆదుకోవాలంటూ వినతి



అమ్మపేటలో కాత, పూత లేని నాలుగు నెలల మిరప తోట



రైతు కొనుగోలు చేసిన మొక్కల రశీదు

ముదిగొండ: మిర్చి రైతు కంట కన్నీరు కారుతోంది. ఆరుగాలం ఖష్టించి పండించే రైతన్నకు అన్ని చోట్ల అగచాట్లే.. దుక్కి దున్ని, ఎరువు వేసి, నారు పోసి విత్తనాలు వేసి, పంటలు పండించినా.. నోటికాడి కొచ్చే సరికి చేజారిపోతుంది. అన్ని సక్రమంగా పండినా, ప్రకృతి విలయతాండవంతో అతలాకుతలం చేసి నష్టాల్లో పడేవేస్తుంది. దీంతో రైతన్న రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలతో అప్పులతో కుదేలు అవుతున్నాడు.

నష్టపోయిన అమ్మపేట రైతులు..

మండలంలోని అమ్మపేట వద్ద వల్లభి ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్రీ వీరాంజనేయ హైటెక్ నర్సరీలో అంకూర్ కంపెనీ విత్తనాలతో తయారు చేసిన మిరప మొక్కలను పదిమంది రైతులు కొనుగోలు చేశారు. 25ఎకరాలకు మిరపనారు కొనుగోలు చేసి తోట వేశారు. ప్రతి ఏపుగా పెరుగుకుంటూ వస్తూ ఉన్నా, ఇప్పటికీ కాత పూత లేదని రైతులు నివ్వెరపోయి, ఏమి చేయాలో పాలుపోక అధికారులకు మొరపెట్టుకున్నారు. మండలవ్యవసాధికారిణిని రైతులందరూ సంప్రదించగా, మాకు సంభందించింది కాదని, ఆర్టికల్చర్ అధికారులను సంప్రదించాలని సూచనచేయగా కంపెనీ ప్రతినిధులు వచ్చి చూశారు. వారు ఎటూ తేల్చలేక రైతుల మెప్పు కోసం ఫొటోలు తీసుకుని వెళ్లారు.

ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి..

ఒక్కో రైతు ఎకరాకు మిరపనారుకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చుచేసి కొనుగోలు చేశామని రశీదులు చూపించి 'సాక్షి'ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పదిమంది రైతులు భూమి కౌలుకు తీసుకుని 25 ఎకరాల్లో మిరపనారు కొనుగోలు చేసి పండించారు. తీరా పండకపోయే సరికి తమకు కౌలు, ఎరువులు, మిరపనారు, దుక్కులు దున్నిన ఖర్చులు, కూలీల ఖర్చు మొత్తంగా ఎకరానికి రూ.లక్ష వచ్చిందని అమ్మపేట రైతులు వాపోయారు.



వివరాలు వెల్లడిస్తున్న రైతులు

ఆర్టికల్చర్, వ్యవసాయఅధికారులు ఎటూ సమాధానం చెప్పలేక చేతులు దులుపుకున్నారు.

లబోదిబో మంటున్న రైతులు..

ఈ సీజన్‌లో మిరపపంట పండి కాయలు ఇంటికి వచ్చే టైంలో ఇంతవరకు ఎలాంటి కాత, పూత, పిందె లేదని.. రైతులు లబోదిబోమంటున్నారు. ఇంత భారీగా నష్టం వాటిల్లడానికి కారణం మిరపనారు కల్తి విత్తనాలే నని రైతులు ఆరోపిస్తున్నారు. కావున తామంతా కలిసి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి ఇంత జరగటానికి కారణమైన హైటెక్ నర్సరీపై ఫిర్యాదు చేస్తామని, తగు నష్టపరిహారం ఇచ్చేదాక వదిలేది లేదని రైతులు వాపోతున్నారు.

పురుగుల మందే శరణ్యం..



రెండు ఎకరాలు రూ.50 వేలకు కౌలుకు తీసుకుని మిరపతోట వేయడానికి హైటెక్ నర్సరీలో 15వేల మొక్కలను రూ.20 వేలకు కొనుగోలు చేశాను. ఎరువులు, పురుగుమందులు, కూలీలు, దుక్కులు, తోటలో సాలు ఇతర ఖర్చులు కలిపి ఎకరానికి రూ.లక్ష వరకు నష్టపోయా. అధికారులు పట్టించుకోకపోతే పురుగుల మందే శరణ్యం.

– రేగళ్ల కృష్ణయ్య, కౌలు రైతు, అమ్మపేట

వడ్డీకి తెచ్చి మొక్కలు కొన్నా..



హైటెక్ మిరప నారు కొనాలంటే అప్పు ఇవ్వరని, వడ్డీకి తీసుకొచ్చి మరీ రెండు ఎకరాల్లో తోట వేశా. అయినా, ఇంత వరకు కాత పూత లేదు. సరైనా సమయంలో ఇంత నష్టం వస్తుందని అనుకోలేదు. అధికారులు స్పందించి కంపెనీపై, నర్సరీపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలి. పరిహారం ఇవ్వాలి.

– ఊటుకూరి బాబు, కౌలు రైతు, అమ్మపేట

అప్పులే మిగిలేట్టుంది..



మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపతోట వేశాను. ఎప్పుడూ ఇట్లాంటి నష్టాన్ని చవిచూడలేదు. కౌలుకి రూ.75 వేలు, మిరపనారుకు రూ.30 వేలు, ఎరువులు, దున్నుడు కూళ్లు ఇవన్నీ నష్టమే. అధికారులు వచ్చి చూశారు. ఇంత వరకు ఏమీ సమాధానం చెప్పలేదు. నకిలీ మిరప నారు అమ్మిన నర్సరీపై చర్యలు తీసుకోవాలి.

– వడ్డెల్లి శ్రీనివాసరావు, కౌలు రైతు, అమ్మపేట

పథకాలపై అనుమానాలొద్దు..

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్



సత్తుపల్లిటౌన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



కారేపల్లి: విశ్వనాథపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

సత్తుపల్లిటౌన్/కల్లూరు/వేంసూరు: అభయహస్తం పథకాలు వస్తాయో.. రావోననే టెన్షన్ పడొద్దని ఈ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ పథకాలు అందుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని 16వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆమె పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కాగా సత్తుపల్లిలో జరిగిన ప్రజాపాలన సభలో కౌన్సిలర్లతో వార్డులో ప్రజాపథం దరఖాస్తులు పంపించారని.. ఇవి కొందరికే అందాయని కాంగ్రెస్ నాయకులు కమిషనర్ కె.సుజాతపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేటలో, వేంసూరు మండలంలోని కందుకూరు, వెంకటాపురం పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు హామీలను అమలు చేసిందని, ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారంటీలు అందిస్తామన్నారు. అధికారుల చుట్టూ పథకాల కోసం తిరిగే పనిలేకుండా అధికారులే ప్రజల మధ్యకు వచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టారన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య ఉన్నా చెప్పవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు వీరపనేని రాధిక, మేకల భవాని, ఏఈ శరత్‌బాబు, ఎంపీడీఓ రమేష్, ఏఓ రామ్మోహన్, ఎంపీఓ రంజిత్ కుమార్, నాయకులు వెల్ది జగన్‌మోహన్‌రావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి, జంగ శ్రీనివాసరెడ్డి, బండి వెంకటేశ్వరరెడ్డి, కార్యక్రమంలో ఆర్డీఓ అశోకచక్రవర్తి, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు, విశ్వనాథపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను గురువారం సందర్శించారు. గ్రామసభల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రతీ ఒక్కరి నుంచి దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా స్వీకరించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఆయన ప్రజలతో ముచ్చటించారు. ఎర్రబోడు గ్రామంలో దుప్పెల్లి శ్రీను కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మాధారం డోలమైట్ మైన్స్ యాజమాన్యం, యూనియన్ నాయకులతో సమావేశమైయ్యారు. పేరుపల్లి గ్రామంలో ఇటీవల కత్తిపోట్లకు గురై చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న హేమ్లా, సతీష్‌లలతో పాటుగా కారేపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు కంచి రమేష్‌ను పరామర్శించారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల పెద్దలు ఉన్నారు.

సాగునీరు అందించాలి



కొణిజర్ల: మంత్రి తుమ్మలకు సమస్యను వివరిస్తున్న ప్రజాపంథా నాయకులు

కొణిజర్ల: మండలంలోని రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు సాగర్ నీరు అందించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని గుబ్బగుర్తి సమీపంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. రామనర్సయ్య నగర్, క్రాంతినగర్, జంపాలనగర్, ఎల్లన్న నగర్, గుబ్బగుర్తి, సాలెబంజర, విక్రమ్‌నగర్, తీగలబంజర గ్రామాల్లోని రైతుల మొక్కజొన్న పంటలకు సాగునీరు లేక ఎండిపోతున్నాయని, సాగర్‌నీరు అందించి ఆదుకోవాలని వినతిలో పేర్కొన్నారు. వినతి అందించిన వారిలో ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోగినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు కంకణాల అర్జున రావు, ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్మన్..

వైరా: కొణిజర్ల మండలం అంజనాపురం పర్యటనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అంజనాపురంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైరా నాయకులు మిట్టపల్లినాగి, సూర్యదేవర శ్రీధర్, తదితరులు ఉన్నారు

క్యాలెండర్లు ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ జయరాజు

ఏన్కూరు: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలెండర్లను మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల కోసం కలసికట్టుగా పోరాటం చేయాలన్నారు. పదో తరగతిలో విద్యార్థులకు ఉత్తమ మార్కులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కూరాకుల సైదయ్య, చింత రాజు, వెంకటేశ్వర్లు, అబ్దుల్ మజీద్, లంకా సురేష్, నిర్మల్‌కుమార్, బి.వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మామిళ్లపల్లి కృష్ణయ్యకు సండ్ర వెంకటవీరయ్య..

సత్తుపల్లి/తల్లాడ: సత్తుపల్లి మండలంలోని అనారోగ్యంతో గురై చికిత్స పొందిన కిష్టారం సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్యను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నరుకుళ్ల చిట్టెమ్మకు నివాళులర్పించారు. తల్లాడ నరసింహారావుపేటలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శనక్కాయల నరసింహ భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వర రావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, యాగంటి శ్రీనివాసరావు, అప్పారావు, నరేంద్ర, శ్రీను, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సుంకర వెంకటఅప్పయ్య, దొడ్డా చిన్న శ్రీను, మారెళ్ల దేవేందర్, నాగయ్య, సున్నా తిరుమల్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పువ్వాడ అజయ్..

బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పైడిపల్లి సత్యనారాయణ మాతృమూర్తి అరుణ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గురువారం పరామర్శించారు. అరుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు వీరయ్య, కార్పొరేటర్ కోటి, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కిశోర్‌బాబు, హరికృష్ణ, చావా హనుమంతరావు, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జయంతి

మధిర: తెలంగాణ యూటీఎఫ్ మధిర డివిజన్ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సంఘం మండల కార్యదర్శి జీబీఎంఎస్ రాణి అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ, కార్యాలయం కన్వీనర్ లక్ష్మణ్‌రావు, కళావతి పాల్గొని సావిత్రీబాయి పూలే సేవలను కొనియాడారు. అనంతరం తెలంగాణ యూటీఎఫ్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో మండల అధ్యక్షులు ఏ.వినోద్ రావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మీరాఖాన్, ఆశీర్వాదం, ఇర్రి వీరయ్య, షేక్ ఇబ్రహీం, సీహెచ్ సాధు సమాధానం, భాస్కర రావు, చెన్నయ్య, డి.భీమ్ శంకరరావు, ఎం.రాజు, రాణి తదితరులు పాల్గొన్నారు.

'విజయ'లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, మాస్టర్ ట్రైనీలు

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో కార్పొరేట్ ఈకో సిస్టమ్, లీడర్ షిప్ కాంపిటెన్సెస్ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ చల్లా ప్రవీణ్, ప్రముఖ జీపీసీ సర్టిఫైడ్ ట్రైనర్ జవహర్‌బాబు, ప్రవీణ్‌కుమార్‌లు వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయేషా తరుణమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చిన్నయ్య, ఎకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు సాయినాథుని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఎర్రుపాలెంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సైన్స్ ఫెయిర్, రంగోలి



ఎన్విరాన్‌మెంట్ పై విద్యార్థుల ప్రదర్శన

కల్లూరు: కల్లూరు గురుకుల కళాశాలలో గురువారం జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైంటిఫిక్ రంగోలీ, సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జన్య ల్యాబ్ ఇన్ ఎ బాక్స్ కార్యక్రమంలో భాగంగా బ్రిస్టల్ ఆధ్వర్యంలో సమకూర్చిన బోధనా మరియు అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదిలో కృత్యముల నేర్చుకున్నటువంటి సైన్స్ మరియు గణితం అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించడం జరిగింది. దీంతో విద్యార్థులు పటాలలోని భాగాలు, వాటి నిర్మాణం గురించి ఎక్కువ కాలం గుర్తుంచుకోగలుగుతారు. తద్వార పఠనా సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాకుండా సైన్స్ మరియు గణితం అంశాలను ఆడుతూ, పాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా రివిజన్ చేసుకోవడమనేది అప్రయత్నంగానే జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.శ్రీలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన్య ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది, జన్య ఫౌండేషన్ సభ్యులు శివకుమార్, జాని పాల్గొన్నారు.

సాగర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్: కప్పల బంధం, నాగార్జున సాగర్ ప్రధాన కాలువపై నిర్మించిన బ్రిడ్జికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అధికారులను ఆదేశించారు. గురువారం ఈ బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, సత్యంబాబు, మోహన్‌నాయక్, తురాబ్‌అలీ, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

ప్రజాపాలన గ్రామసభలో గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కల్లూరు మండలంలో నిర్వహించిన గ్రామసభలలో ఆర్డీఓ కల్యాణ్‌చక్రవర్తి, తహసీల్దార్ పులి సాంబవుడు, ఎంపీడీఓ రవికుమార్, ప్రత్యేక అధికారిణి సునీత, సర్పంచ్‌లు మోహన్‌నాయక్, ప్రమీల దేవి, నామారాధమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎండి .ఆసీఫ్, హరీష్, ఓఓ రూప, ఏఈ శైలు గణేష్, తిరుపతయ్య, ఐకేపీ ఏపీఎం వెంకటరమణరావు, డీఎల్‌పీఓ ప్రభాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థమే ప్రజాపాలన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్

కొణిజర్ల: ప్రజాపాలన సభలు ప్రజల సౌకర్యార్థమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లిలో జరిగిన ప్రజాపాలన సభను గురువారం వారు సందర్శించి దరఖాస్తులు స్వీకరణను పరిశీలించారు. దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కాగా, మండలంలోని కొండవనమాల, మల్లుపల్లి, రామనరసయ్య నగర్ గ్రామాల్లో కూడా గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, తహసీల్దార్ ఎండీ.తఫజల్ హుస్సేన్, సర్పంచ్‌లు కమటాల రేణుక, రాయల నాగేశ్వరరావు, కె.కాంతమ్మ, శిల్పమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు విశేష స్పందన



వైరా: 12వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. గురువారం ఆయా మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా.. ఆయా గ్రామ ప్రజలు అందించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ క్రమంలో పలువురు అధికారులు సభలను సందర్శించి దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 6వ తేది నాటికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు గ్రామసభల్లో ఇవ్వని వారు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో అందించొచ్చన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చింతకాని: ప్రొద్దుటూరులో.. డీపీఓ హరికిషన్



ముదిగొండ: గోకినేపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్



మధిరరూరల్: క్యూలో నిల్చున్న మహిళలు

నిబద్ధత కలిగిన నాయకుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర నాయకుడు మధు

కొణిజర్ల: కమ్యూనిస్టు పార్టీలో సైద్ధాంతిక నిబద్ధత కలిగిన నాయకుడు ముత్తన బోయిన కోటేశ్వరరావు అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అవునూరి మధు, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలు పార్టీల నాయకులు కొనియాడారు. గురువారం తీగలబంజర గ్రామంలో ముత్తనబోయిన కోటేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలేసి నివాళులు అర్పించారు. షేక్ ఖాసీమ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, ఆప్ జిల్లా నాయకులు యర్రా బాబు, బొంతురాం బాబు, షేక్ లాల్‌మియా, నల్లమోతు తిరుమల రావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మ, స్వర్ణ సుబ్బారావు, తాతా సుధాకర్, కొణిజర్ల మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.